క్లుప్తంగా

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుకర్

దహెగాం: విద్యార్థులు కష్టపడడంతో పాటు ఇష్టపడి చదవాలని తహసీల్దార్ మధుకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని సూచించారు. ట్రస్టు అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కోనేరు కృష్ణారావుతో సంఘం సభ్యులు

బెజ్జూర్: దేవాంగ సంక్షేమ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. బుధవారం బెజ్జూర్ మండలం దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు జెడ్పీ వైస్ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు కోండ్ర జగ్గా గౌడ్, మండల దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగుల రవికుమార్, సభ్యులు శేఖర్, సమ్మన్న, కొండయ్య, సంతోష్, సదాశివ్, దామోదర్ ఉన్నారు.

రేపు మాల కులస్తుల సమావేశం

బెజ్జూర్: మాల (మహర్) కులస్తుల సమావేశాన్ని ఈనెల 27న మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించనున్నట్లు బుద్ధ సంఘం సిర్పూర్ తాలూకా ఉపాధ్యక్షుడు దుర్గం దేవాది ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల మాల కులస్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం ఆలయంలో రుణవిమోచక గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు చందావార్ రవిచంద్ర శర్మ, శ్రావణ్ శర్మ, శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు చందావార్ బాలేశ్వర శర్మ, ఢిల్లీ విజయ్‌కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

తిర్యాణి: ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, మండల పరిషత్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపాల్ టి.స్వరూప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు రాము, ఆంజనేయులు, శ్రీనివాస్ నాయక్, రాజాం, రామారావు, అశోక్, రాంబాబు, రంజిత్, మోతిలాల్ నాయక్, రజిత, తస్లీమున్నిసా బేగం, సమత పాల్గొన్నారు.

పరిచయ వేదిక పోస్టర్ల విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం భవనంలో సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పద్మశాలి నూతన వధూవరుల పరిచయ వేదిక పోస్టర్లను బుధవారం స్థానిక భవన్‌లో సంఘం నాయకులు విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 29న నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్స్‌లో పద్మశాలి నూతన వధూవరుల పరిచయ వేదిక ఉంటుందన్నారు. వివరాలకు 6304242113 నంబర్‌పై సంప్రదించాలని కోరారు.

‘ఆహ్లాదం’ అందనంత దూరం

- గ్రామాలకు దూరంగా పల్లె ప్రకృతివనాలు
- వాటిపై ఆసక్తి చూపని ప్రజలు



పులికుంట పల్లె ప్రకృతివనం

రెబ్బెన: పచ్చదనంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. అయితే అవి గ్రామాలకు దూరంగా ఉండడంతో ప్రజలు అటువైపు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 67 హాబిటేషన్లు ఉన్నాయి. ఆయా హాబిటేషన్ పరిధిలో ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేసింది. మండలంలో మొత్తం 24 పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. ప్రకృతివనాల్లో నీడనిచ్చే అటవీజాతి మొక్కలతో పాటు రకరకాల పూలమొక్కలు, ఇతర మొక్కలు నాటారు. వనంలో కలియ తిరిగేందుకు పాత్‌వేలు, కూర్చునేందుకు బెంచీలు సైతం ఏర్పాటు చేశారు. ప్రకృతివనాల నిర్వహణ అంతా బాగానే ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాల్లో గ్రామాలకు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయటంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ఆహ్లాదానికి దూరమవుతున్న ప్రజలు

మండలంలోని ఇందిరానగర్, రెబ్బెన, నంబాల వంటి కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రమే గ్రామాలకు అనుకుని ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉండటంతో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. ఇక మిగిలిన పంచాయతీల్లో దగ్గర్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవటంతో దూర ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. గోలేటి గ్రామ పంచాయతీ పల్లె ప్రకృతివనాన్ని గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పులికుంట వాగు సమీపంలో ఏర్పాటు చేశారు. పులికుంట కోసం కేటాయించిన పల్లె ప్రకృతివనాన్ని అటవీప్రాంతానికి ఆనుకుని ఏర్పాటు చేయగా, రాంపూర్ పల్లె ప్రకృతివనాన్ని గ్రామానికి దూరంలో, వంకులం పల్లె ప్రకృతివనాన్ని రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. తుంగెడ, తక్కళ్లపల్లి, గంగాపూర్, పాశిగాం ప్రకృతివనాలను సైతం గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు.

దూరంగా ఏర్పాటు చేశారు



గోలేటి పల్లె ప్రకృతివనాన్ని గ్రామానికి చాలా దూరంలో ఏర్పాటు చేశారు. ప్రకృతివనాన్ని అందంగా తయారు చేసినప్పటికీ ఊరికి దూరంగా ఉండటంతో ఎవరికి ఉపయోగ పడడం లేదు. గ్రామానికి దగ్గరగా ఏర్పాటు చేస్తే బాగుండేది.

- గోలెం విలాస్, గోలేటి

అందుబాటులో ఉంటే బాగుండేది



ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుండేవి. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయటంతో ప్రజలు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు.

- దుర్గం రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి

ప్రభుత్వ స్థలాల కొరత

గ్రామాలకు అందుబాటులో ప్రభుత్వ స్థలాలు లేకపోవటంతో అందుబాటులో ఉన్న స్థలాల్లో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇందిరానగర్, రెబ్బెన, నంబాల వంటి కొన్ని పంచాయతీల్లో గ్రామాలకు అనుకుని స్థలాలు ఉండడంతో ఏర్పాటు చేయగలిగాం. మిగిలిన ప్రాంతాల్లో కాస్త దూరంగా ఉన్నాయి. అయినా ప్రజలకు ఆహ్లాదం అందించే రీతిలోనే తీర్చిదిద్దాం.

- సత్యనారాయణ సింగ్, ఎంపీడీవో

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



బెజ్జూర్: ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది



దహెగాంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



పెంచికల్‌పేట్: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



చింతలమానెపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



ఆసిఫాబాద్‌రూరల్: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



వాంకిడి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు



కౌటాల: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అధికారులు



కౌటాల: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

బెజ్జూర్: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. బుధవారం మండలంలోని సోమిని గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎలాది శారదా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు విలువ తెలుసుకుని అర్హులైన వారు ఓటు హక్కు పొందాలన్నారు. అంతకుముందు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కుశ్నపల్లి ఎంపీటీసీ ఆత్రం సాయి, సింగిల్ విండో డైరెక్టర్ పేందం శ్రీహరి, ఉప సర్పంచ్ దుర్గం శంకర్, వార్డు మెంబర్ పంద్రం సుకరాం, అంగన్‌వాడీ టీచర్లు ఆత్రం ద్రౌపతి, పేందం జ్యోతి, నాయకులు చంద్రశేఖర్, శంకరయ్య, సత్తయ్య, యువకులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ మధూకర్ ఆధ్వర్యంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు అనేది వజ్రాయుధమన్నారు. కార్యక్రమంలో డీటీ బక్కయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు పాత్ర ఎంతో కీలకమైందని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలోని రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామస్తులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: దేశాభివృద్ధికి యువత పాటుపడాలని ఎంపీడీవో గంగాసింగ్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని పోతపల్లి గ్రామపంచాయతీలో గల గుండ్లపేట గ్రామంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. దాసరి చంద్రమౌళి, అంగన్‌వాడీ టీచర్ రాజమణి, రైతులు, పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: ఓటర్ల చేతిలోనే దేశ భవిష్యతు ఉందని, అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని కౌటాల తహసీల్దార్ మునావర్ షరీఫ్ అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం బస్టాండ్ ఎదుట ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, ప్రిన్సిపాల్ స్వరూప, ఎన్ఎస్ఎస్ పీఓలు రాము, రాజాం, కార్యదర్శి సాయికృష్ణ, రెవెన్యూ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాందాస్ మాట్లాడుతూ భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, పటిష్టమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ రావు, అధ్యాపకులు వినోద్, శ్రీనివాస్, సతీష్, హరిదాస్ పాల్గొన్నారు.

కెరమెరిలోమాక్ పోలింగ్..

కెరమెరి: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతతో పాటు, ఓటు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ విద్యార్థులకు వివరించారు. ఓటు వేసే పద్ధతిని విద్యార్థులకు వివరించారు. రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రహీముద్దీన్ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండె తుకారాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న లెక్చరర్లు



కెరమెరి: మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జెండా పండుగకు ముస్తాబు



కెరమెరి: కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



చింతలమానెపల్లి: అలంకరిస్తున్న విద్యార్థినులు

చింతలమానెపల్లి: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు బుధవారం ముస్తాబయ్యాయి. జెండా వందనానికి ఏర్పాట్లు చేయడంతోపాటు ఆవరణల్లో అలంకరణ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, బాబాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల, కేతిని బాలుర ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాలల పరిసరాలను శుభ్రం చేసి రంగుల కాగితాలు, మామిడి ఆకుల తోరణాలు కడుతూ సందడిగా కనిపించారు. పలు పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహించారు.

గణతంత్ర ‘క్రీడోత్సవాలు’..

కెరమెరి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని పాఠశాలల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, స్కిప్పింగ్, హై జంప్, లాంగ్ జంప్ తదితర ఆటలు ఆడారు.

నేడు గణతంత్ర వేడుకలు

కౌటాల: మండలంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు బుధవారం ముస్తాబయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండా రెపరెపలాడనుంది.

బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



కాగజ్‌నగర్‌టౌన్: పుస్తకం అందజేస్తున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రధానమంత్రి ఆదేశాల మేరకు పరీక్షపే చర్చ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని బహూకరించిన డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష పై చర్చ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని విశ్వశాంతి, ఎక్సల్ తదితర పాఠశాలల్లో బుధవారం వ్యాసరచన, డ్రాయింట్ పోటీలు నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొని భారత ప్రధాని నరేంద్ర మోదీ రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని ఆయా పాఠశాలల లైబ్రరీల కోసం ప్రధానోపాధ్యాయులకు బహూకరించారు.

రవీంద్రనగర్‌లో ‘కంటి వెలుగు’ ముగింపు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కంటి వెలుగు పరీక్షలు బుధవారంతో ముగిశాయి. రవీంద్రనగర్‌లో ఇప్పటివరకు 538 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వెలుగు వైద్యాధికారి అజ్మీరా రాజ్‌కుమార్ తెలిపారు. వీరిలో 124 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని, మరో 103 మందికి కళ్లద్దాలు అందజేస్తామన్నారు. 101 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. మండలంలోని కోర్సిని గ్రామంలో ఈ నెల 27వ తేదీ నుంచి కంటి వెలుగు శిబిరం నిర్వహిస్తామన్నారు.

భారతీయ బౌద్ధ మహాసభ కమిటీ ఎన్నిక

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండల భారతీయ బౌద్ధ మహాసభ మండల కమిటీని భారతీయ బౌద్ధ మహా సభ సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు, కౌటల ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. పెంచికల్‌పేట్ మండల అధ్యక్షుడిగా సిరిపురం భీమయ్య (మాజీ ఎంపీటీసీ), ఉపాధ్యక్షుడిగా దుర్గం బాపు, ప్రధాన కార్యదర్శిగా ఓ.ప్రేమానందం, గౌరవ అధ్యక్షుడిగా భక్తు రామచందర్ (మాజీ జెడ్పీటీసీ), కోశాధికారిగా పాగడి ఆశన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు డొంగ్రే లహన్‌రాజ్, ఆయా గ్రామాల నుంచి బౌద్ధ సమాజ్ బంధువులు హాజరయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, సభ్యులు మధుకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: పండిట్, పీఈటీ పోస్టుల అప్‌డేట్ తర్వాతే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం కౌటాలలోని ఎంఈవో కార్యాలయం ఎదుట కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని పండిత్, పీఈటీ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన ఇప్ప రవి

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కౌటాల మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన ఇప్ప రవి చింతలమానెపల్లి వైపు వెళ్తుండగా బాలాజీ అనుకోడ గ్రామంలో వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. తలకు గాయాలుకాగా స్థానికులు చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

‘ప్రభుత్వం విఫలం’

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు మోర్లె గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్‌లు బుధవారం ఆరోపించారు.